
# దేశం తగలబడిపోయింది

తూలికాభూషణ్



"దేశం తగలబడిపోతోంది. తగలబడిపోతోందేమిటి ఇంకా? పూర్తిగా తగలబడిపోయింది—మనకింక మోక్షంలేదు" అనేవాడు మా ముత్తాత నా చిన్నతనంలో.

అప్పటికి ఇంకా మన దేశం స్వతంత్రం కాలేదు. స్వతంత్ర భారతం అవతరించడం మా ముత్తాత దర్శించలేదు. అంతటి మహా భాగ్యం లభించి వుంటే ఆయన ఏమని వుండేవాడో నాకు తెలియదు.

చిత్రం ఏమంటే— మన దేశం స్వతంత్రం అయిన పిదప ఒక ఐ.సి.ఎస్. అధికారి- ఆయన ఆ రోజుల్లో అనంతపురం జిల్లా కలెక్టరుగా ఉండేవాడు— నోటివెంట అవే మాటలు విన్నాను. సందర్భం మాత్రం వేరు.

మద్రాసు రాష్ట్రం విభక్తమైంది ఆంధ్రుల ఆందోళన ఫలితంగా. కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది అక్కడ ఒకపత్రిక విలేకరిగా కర్నూలులో పని చేస్తున్నాను.

ఒకనాడు ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలుసుకొనడానికి సెక్రటేరియట్‌కు వెళ్ళాను. పత్రికా విలేకరులందరు కలిసికట్టుగా రోజుకు ఒకసారి ఆయనను దర్శించడం పరిపాటిగా ఉండేది ఆరోజుల్లో.

నాలుగవ తరగతి ఉద్యోగులలో మొదటివాడు కౌన్సిల్ దుబాసి. అతడే ప్రధాన కార్యదర్శికి అటెండర్‌గా ఉండేవాడు.

నేనావిధంగా ప్రధాన కార్యదర్శిని కలుసుకొనడానికి రావడం అంతకుముందు ఎన్నడూ జరగలేదు. ప్రధాన కార్యదర్శి అటెండర్ ఆశ్చర్యం ప్రదర్శించాడు.

"అయ్యగార్ని కలుసుకుంటారా-ఏమైనా ముఖ్యమైన పని ఉందా?" అని ప్రశ్నించాడు.

ఔనన్నాను.

అతడు లోనికి వెళ్ళి- అనుమతి పొంది వచ్చి."వెళ్ళండి,కలుసుకోవచ్చు"అన్నాడు.

వెళ్ళాను. ప్రధాన కార్యదర్శితో నాపని ఒక నిముషం మాత్రమే.

తిరిగివచ్చాను- వెయిటింగ్ రూములోనే కూర్చున్నాను. నా సహచరుల కోసం నిరీక్షిస్తూ.

అప్పుడు గమనించాను ఆ అనంతపురం జిల్లా కలెక్టరు దొరగారిని. ఆయన నాకన్న ముందుగానే వచ్చి ప్రధాన కార్యదర్శి దర్శనం కోసం ఎదురుచూస్తూ ఆ గదిలో కూర్చునివున్నాడుకాబోలు-కోపంతో మండిపడుతూ బుసలు కొడుతున్నాడు.

"దేశం తగలబడిపోతోంది. తగలబడిపోతోందేమిటి ఇంకా? పూర్తిగా తగలబడిపోయింది. మన కింక మోక్షం లేదు" అన్నాడా పెద్దమనిషి.

మా ముత్తాత బ్రతికే ఉన్నారా! అనిపించిందొక క్షణం. తరవాత ఇది దేనికో ఉపోద్ఘాతం అయి ఉంటుంది కనకనూ, వృత్తిరీత్యా వినడం అలవాటు కనకనూ మౌనంగా ఉందాం,తప్పదు అనుకొన్నాను.

నిజంగా అది ఉపోద్ఘాతమే.

"లేకపోతే ఏమిటి? నేను జిల్లా కలెక్టర్ని ఐ.సి.యస్. ఆఫీసర్ని. ప్రధాన కార్యదర్శి దర్శనంకోసం రెండు గంటలనుంచి వేచి వున్నాను. కాలేదింకా. ఈయన ఎవడో ఏ పత్రికవాడో వచ్చాడు. రాజమర్యాదలు జరిగాయి. ఇట్టేవచ్చి. ఇట్టే అయ్యగారి దర్శనం చేసుకుని. హాయిగా కూర్చున్నాడు.

నా స్థితే ఇంత హీనంగా వుంటే. ఇంక నాకన్న తక్కువ హోదాలో వున్నవారి మాట ఏమిటి? ఊహించడానికే భయంగా వుంది. భగవంతుడా!" అన్నాడు కలెక్టర్ దొరవారు.

నాకేమిటి? హాయిగా సిగరెట్టుకాల్చుతూ. వింటూ కూర్చున్నాను.

అటెండర్ మాత్రం కోపం తెచ్చుకున్నాడు.

"మీరిలాగే వాగారంటే రెండుగంటలు కాదు. రెండు వారాలు కర్నూలులో కూర్చోవలసివస్తుంది అయ్యగారి దర్శనం కోసం నిరీక్షిస్తూ. జాగ్రత్తగా మాట్లాడడం మీకే మంచిది" అన్నాడు.

కలెక్టరు దొరగారు మౌనంగా ఉండిపోయారు. లోలోపల బుసకొడుతూనే ఉన్నారు- మరి.

ఆయన ఒక అటెండర్ చేత అంతగా అవమానంపొందడం చూస్తూ కూర్చోవటం భావ్యం కాదనిపించి మెల్లగా అక్కడనించి అప్పటి మట్టుకు జారుకొన్నాను.

అధికారులు, అందునా పెద్ద అధికారులు క్రింది ఉద్యోగులకు ఎంతో గౌరవం ఇచ్చేవారు ఆ రోజుల్లో. క్రింది వారు పైతం విశేషమైన బాధ్యతతో తమ విధులు నిర్వర్తించేవారు.

పరస్పరం గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకొనేవారు. దూషణలు, తిరస్కారాలు కావు.

తెల్లవారు అంటే ఇంగ్లీషువారు కొంతకాలం 'కుంఫినీ' పేరుతో. తరవాత హిజ్/హెర్ మెజెస్టీ తరపున మొత్తం రెండున్నర శతాబ్దాల పర్యంతం మన దేశాన్ని పాలించాడు. పాలు పూర్తిగా పితికి వట్టిపోయిన ఆవును విడిచి వెళ్ళిపోయాడు— అని తిట్టిపోస్తారు పలువురు.

అలాంటి దుర్జనులైన ఇంగ్లీషువారిలో కూడా-అటెండర్‌గా పని చేసే మనిషి. అందునా భారతీయుడిచేత అంతగా అవ

## వాస్తవమ్మ రావిశాస్త్రి మాట!

శ్రీ రా. వి శాస్త్రిగారు 12-10-73 న విశాఖ పౌర హక్కుల సమితి సభలో అధ్యక్షోపన్యాసం యిస్తూ యిలా అన్నారు:

"హంపీ విజయనగర రాజుల రాజ్యంలో మన విజయనగరం రాజుల్ని సామంతుల్ని చేసి వాళ్ళద్వారా పాలించేరు. అలాగే నైజాం నవాబు విజయనగరం రాజులకు మన్నెసుల్తాన్ బిరుదిచ్చి పాలించేరు. బ్రిటిష్ వాళ్ళు వారిద్వారానే పాలించేరు. కాంగ్రెసు రాజ్యంలో విజయనగరంరాజు మంత్రి అయి మనని పాలించేరు. కాబట్టి ఎప్పుడూ విజయనగరం రాజులే మనని పాలించేది."

(రావి శాస్త్రీయం— "పులులు-మేకలు"—పుట 177)

**హనుమంతుడి తోక :**

గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ఓడించి తెలుగు దేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. నూతన మంత్రివర్గంలో మరో విజయనగరం రాజు మంత్రి అయి— ప్రస్తుతం మనల్ని పరిపాలిస్తున్నారు.

— వమ్మి

మానం పొందినా ఊరక ఉండిపోయాడే! అని విస్తుపోయాను.

నా మిత్రుడు ఒక అటెండర్‌తో అదే అన్నాను.

"అందులో ఆశ్చర్యం ఏముంది? మనిషిని మనిషిగా గుర్తించడం ఇంగ్లీషువాడి నైజం. విదేశాల పాలకులుగా వున్నవారిలో కొందరు, కొందరేమిటి? —పలువురు అహంభావం, నిరంకుశత్వం ప్రదర్శించినా అందరిలోనూ అలాంటి అవలక్షణాలు వెర్రితలలు వేయలేదు. నాకు తెలిసిన ఒక అటెండర్ గాథ చెబుతాను, వినండి. మీకే అర్థం అవుతుంది" అన్నాడు.

సావధానంగా వినడానికి కూర్చున్నాను. అప్పుడు నాకు పనికూడా లేదు.

"అతడి పేరు నరసయ్య. అతను, నేను ఒక్కసారే ప్రభుత్వోగాలలో చేరాము. మా అర్హతలకు తగినది, మేము ఆశించగలిగింది ఒక్క అటెండర్ ఉద్యోగమే.

నరసయ్య ఒక దొరగారిదగ్గర పనిచేసేవాడు. ఆయన ఐ. సి. ఎస్. ఆఫీసరు.

వయసు తక్కువ. అనుభవం లేదు. పని తెలియదు.

ఎంత జాగ్రత్తగావున్నా పనిలో ఏదో లోపాలు తప్పులు, పొరబాట్లు జరుగుతూనే వుండేవి.

తప్పుచేస్తే చాలు దొరగారు నరసయ్య తోలు వలిచేవారు.

దెబ్బల బాధ పడలేక పారిపోతే తరిమి తరిమి పట్టుకుని చితకకొట్టేవాడు.

తరిమినా దొరకనంతదూరం పారిపోతే గుర్రం ఎక్కి ఎక్కడవున్నా వెదికిపట్టుకుని హంటర్‌తో ఒళ్ళు చీరేవాడు.

ఒక పక్క పని ఎలా వేయాలో చెప్పేవాడు ఓపికగా. ఇంగ్లీషు చక్కగా వ్రాయడం, మాట్లాడడం నేర్పాడు.

ఎక్కడికి బదిలీ అయినా కోరి నరసయ్యను వెంటబెట్టుకొని పోయేవాడు. దానితో ఈ పీడ ఎప్పటికైనా వదులుతుందనే నరసయ్య ఆశ అడియాస అయ్యేది. ఇంక ఈ జన్మకి నరకం తప్పదనే భయం పట్టుకుంది నరసయ్యని.

భయంతో, బాధతో, దెబ్బలతో చస్తూ బ్రతుకుతూ అలా ఆ ఇద్దరూ దాదాపు రెండు దశాబ్దాల పర్యంతం కాంతి రహితమైన సహజీవనం నెరపారు.

దేనికైనా అంతం అంటూ వుండి తీరుతుంది కదా? అలాగే ఆ ఇద్దరూ విడిపోయే సమయం వచ్చింది.

దొరగారు రిటైర్ అయ్యారు. ఇంగ్లండు వెళ్ళిపోయేముందు నరసయ్యని పిలిచారు.

"నరసయ్యా! పనిలో ఆరితేరావు. ఇంక ఉద్యోగంలో నీకు ఎలాంటి సమస్యలూ ఉండవు. నా బాధకూడా ఉండదు" అన్నారు.

పాపం! పిచ్చివాడు నరసయ్య ఆ మాటలకు కంటనీరు పెట్టుకున్నాడు. దొరగారు ఓదార్చారు.

నరసయ్య కుటుంబం వివరాలు, పిల్లల చదువు సంధ్యలు అన్నీ వివరంగా అడిగి తెలుసుకొన్నారు.


పిల్లలకు చదువు చెప్పించమని, అటెండర్లను చేయవద్దని, ఎంత కష్టపడి అయినా పిల్లల భవితవ్యాన్ని ఉజ్జ్వలంగా తీర్చిదిద్దమని దొరగారు నరసయ్యకు హితవు చెప్పారు.

దొరగారు ఇంగ్లండు చేరిన తరవాత రెండు మూడు నెలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం అయింది. అంతకు ముందుగా దొరగారు పంపిన చెక్కు నరసయ్య అందుకొన్నాడు.

దొరగారు పంపిన మొత్తం నరసయ్య ముగ్గురు పిల్లలు ఆ ఏడాది చదువు కొనడానికి చాలు. అంతేనా? ఆ కుటుంబం హాయిగా ఒక ఏడాది బ్రతకడానికి కూడా చాలు.

అలాగే ప్రతి ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభంలో దొరగారు పంపిన చెక్కు నరసయ్య అందుకుంటూ వుండేవాడు.

జీతం జీతం వళంగా బాంకులో వేసుకొనేవాడు.



కూతుర్ని గ్రాడ్యుయేట్‌ను చేశాడు. పెళ్ళి సంబంధం కుదిరిన తరువాత ఆహ్వానం పంపితే ఖర్చులకుగాను మరొక చెక్కు పంపాడు దొరగారు పెద్ద మొత్తానికి.

కొడుకులు ఇద్దరూ పెద్ద చదువులు చదువుకొన్నారు. చదువులకుతగ్గ పెద్ద ఉద్యోగాలలో చేరారు.

పుట్టినవాడు గిట్టక తప్పదు కదా?

దొరగారు మృతి చెందారు. తనకు, తన కుటుంబానికి అంతటి మహోపకారం చేసిన మనీషి మృతిచెందడం నరసయ్యకు అశనిపాతం అయింది.

చిత్రమేమంటే — దొరగారు మృతి చెందిన తరవాత విద్యా సంవత్సరం ప్రారంభంలో దొరగారి సతీమణి ఒక చెక్కు—మామూలుగా పంపే మొత్తానికి పంపారు.

తన అనంతరం నరసయ్యకు ఏటా ఎప్పటి వలె సహాయం అందజేయాలని తాను కోరుతున్నట్లు దొరగారు విల్లులో వ్రాశారని. అందుకు తగినంత మొత్తం ప్రత్యేకించారని దొరగారి సతీమణి నరసయ్యకు తెలియపరిచారు.

విధి నిర్వహణంలో కాఠిన్యం, అశ్రద్ధ పట్ల అసహనం, మానవత్వపు విలువలు మూర్తీభవించిన వ్యక్తిత్వం.

ఇవి ఈనాడు ఎంతమంది విషయంలో నిజమని చెప్పగలం?

దేశం తగలబడిపోతోంది. తగలబడిపోతోందేమిటి ఇంకా? పూర్తిగా తగలబడిపోయింది" అని చెప్పాడు నా మిత్రుడు.

మా తాతయ్య ఆత్మ ఇంకా పలువురిని ప్రభావితులను చేస్తూనే ఉందనుకొన్నాను.


జాన్సన్ మిక్సర్



* అత్యంత శక్తివంతమైన మోటారు
* తక్షణ సర్వీసు సదుపాయం.
* 3 జార్లతో పేర్పతి సర్వీసు

సోనో విజన్,
ఏలూరు రోడ్, విజయవాడ—2.

SUVARNA

ఇంటర్ విద్యార్థులారా! టెస్టుపేపర్లు కొనకండి
ఉచితంగానే TEST PAPERS
For Only Guide Cost Now Available
namaste books Presents
Sai Made Easy Series
GUIDE AND TEST PAPERS (English Medium)
INTERMEDIATE 1983-84

| | |
|---|---|
| PHYSICS | R.Chalapathi Rao's 1st YEAR 14.00, 2nd YEAR 14.00 |
| CHEMISTRY | J. GOPALA KRISHNA MURTHY Dr.K.CHANDRA MOHANA RAO'S 1st YEAR 10.00, 2nd 12.00 |
| BOTANY | Dr.T.S.Rama Rao's 1st YEAR 14.00, 2nd YEAR 12.00 |
| ZOOLOGY | T.V.SIVA SASTRY'S 1st YEAR 14.00, 2nd YEAR 14.00 |
| CIVICS | M.V.L.Narasimha Rao's 1st YEAR 9.00, 2nd YEAR 11.00 |
| ECONOMICS | Dr.T.DIVAKARA RAO'S 1st YEAR 10.00, 2nd YEAR 15.00 |

NO V.P.P. SYSTEM SEND THE COST OF THE BOOKS LESS ONE RUPEE. THE BOOKS WILL BE SENT BY V.P.P. FOR BALANCE OF ONE RUPEE ONLY FREE POSTAGE

నమస్తే బుక్స్
విజయవాడ.520002 * ఫోన్ 74645

మీకు బేబి/బాబు కావాలా?



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులు ఐన్చిన యోగ్యతా పత్రములు గలవు శ్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు ఉచిత వివరములకు

శ్రీ వాగార్జున మూలిక కుటీరం,
రామాలయం వీధి రైల్వేస్టేషన్ దగ్గర తెనాలి—2
శివ శైలు, కేదారేశ్వరపేట విజయవాడ—3

సముచితమైన వ్యాఖ్యలకు, సువిశితమైనసంపాదకీయాలకు, సుందరమైన వ్యాసాలకు.

ఆంధ్రజ్యోతి
దినపత్రిక చదవండి!

మయోస

మయోస అనే రూ.2. ధరగల పాకెట్‌లోని పరిమళద్రవ్యాన్ని గ్లాసునీటిలో కలిపితే తయారయ్యే రూ.30. విలువచేసే అత్యుత్తమ షాంపూను మీరే స్వయంగా చేసుకోవచ్చు. దీనితో సుఖంగా అనేకసార్లు తలంటుకోవచ్చు. కాబట్టి కుంకుడుకాయలకన్నా చాలా చౌక. అన్నిషాపులలోను దొరుకును. మీషాపువారికిది చూపించినచో మీకు వారు సప్లయి చేయగలరు. పట్టణవారిపంపిణీదార్లు, డీలర్షిపులకు క్రిందిఅడ్రసుకు వ్రాయండి. దేశసేవ, హైదరాబాదు, 500890.

దరఖాస్తులు కోరబడుచున్నవి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే రిజిస్టరు చేయబడినది. ESTD : 1979

ఉద్యోగములు 1 Clerks 2 Cashiers 3 Accountants 4. Field Man 5. Field Assistant 6. Sub Assistant 7. Sugar Cane Assistant 8. Field Maistry 9 Craft Teachers. విద్యార్హత : 7th Pass to S. S C. Inter. Degree Pass or Fail

జీతము : రు. 480/-ల నుండి రు. 720/-ల వరకు పొందవచ్చును. పై విద్యార్హతలు గలవారు అగ్రికల్చర్/అకౌంటెన్సీ కోర్సులందు రెగ్యులర్/పోస్టుద్వారా శిక్షణ పొందవచ్చు శిక్షణానంతరము జరుగు ప్రభుత్వ పరీక్షలందు ఉత్తీర్ణులయినవారు పై ప్రభుత్వోద్యోగములలో నియమింపబడుటకు అర్హులగుదురు. రెగ్యులర్ విద్యార్థులకు భోజన హాస్టలు వసతి కలదు దరఖాస్తు ఫారము పూర్తి వివరములకు 12 రోజులలోగా రు. 4/-లు M O ద్వారా ఈ క్రింది అడ్రసుకు పంపి పొందవచ్చును

Principal, S. N. A. T. TRAINING INSTITUTE
Addanki-523 201 Prakasam District (A.P.)